క్లుప్తంగా

ఏకాంతసేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



సంగమేశ్వరస్వామి, కామాక్షిదేవి ఏకాంత సేవ

సంగం: సంగం పినాకిని నది తీరంలో కొలువైన సంగమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు శనివారం అర్ధరాత్రి ఏకాంత సేవతో ముగిశాయి. ఏప్రిల్ 5వ తేదీ ప్రారంభమైన సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రతినిత్యం వివిధ రకాల అలంకారంలో కామాక్షిదేవి సమేతుడై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఏకాంత సేవ సందర్భంగా వింజామరలతో విసురుతూ ఏకాంత సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంగమేశ్వరస్వామి ఏకాంత సేవలో వందలాది మంది భక్తులు పాల్గొని వీక్షించారు.

ఎమ్మెల్యే మేకపాటి పరామర్శ



మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని కేతిగుంట మాజీ సర్పంచ్ కుటుంబానికి చెందిన అనసూయమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం వారింటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మందాడి శ్రీనివాసులునాయుడు, ఎరుకులనాయుడు, ఉర్లగంటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పనులు వేగవంతం చేయండి



కామిరెడ్డిపాడులో సర్వే పనులను పరిశీలిస్తున్న ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి

సోమశిల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న భూ హక్కు భూ రక్ష పథకంలో జరుగుతున్న రీసర్వే పనులను వేగవంతం చేయాలని ఆత్మకూరు ఆర్డీఓ ఎస్ కరుణకుమారి తెలిపారు. సర్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసమూర్తితో కలిసి ఆర్డీఓ ఆదివారం అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడులో జరుగుతున్న సర్వే పనలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సర్వేకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అనంతసాగరం సర్వే డీటీ నాగలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చెర్లోయడవల్లిలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఆత్మకూరురూరల్: మండలంలోని చెర్లోయడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆత్మకూరు శ్రీవారి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ పయ్యావుల కృష్ణప్రసాద్, గుండె వ్యాధులు, పక్షవాతంతో పాటు సాధారణ రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో ఓపీ రాయించుకున్న వారికి ఆత్మకూరు శ్రీవారి ఆస్పత్రిలో ఉచితంగా డాక్టర్లు అందుబాటులో ఉండి రోగ నివారణకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీవారి ఆస్పత్రి నిర్వాహకులు దిలీప్‌యాదవ్, సిబ్బంది చైతన్యకుమార్, స్వరూప, శ్రీలక్ష్మి, రామిరెడ్డి, హజరత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి పూలే పురస్కారం



అవార్డును అందుకుంటున్న విజయప్రదీప్

సంగం: సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు ఎం.విజయప్రదీప్ రాష్ట్ర జ్యోతిరావుపూలే పురస్కారం అందుకున్నారు. తిరుపతికి చెందిన స్టేట్ పూలే టీచర్స్ ఫెడరేషన్ నిర్వాహకులు విజయప్రదీప్ చేసిన సేవలకు ఆదివారం తిరుపతిలోని దుర్గాభాయ్‌దేశ్‌ముఖ్ ప్రాంగణంలో అవార్డును జస్టిస్ చంద్రకుమార్, తిరుపతి విద్యాశాఖాధికారి వి.శేఖర్ చేతుల మీదుగా అందుకున్నారు. గతంలో 2019లో విజయప్రదీప్ స్టేట్ సోషల్ బెస్ట్ టీచర్ అవార్డును ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ద్వారా అందుకోవడం విశేషం.

ఉలికి పడ్డ కావలి

- భద్రత వలయంలో ఉండే కాలనీలో భారీ చోరీ
- పోలీసుల భద్రతా వైఫల్యానికి అద్దం పడుతున్న ఉదంతం
- పట్టణంలో భద్రతాలోపం ఉందని ముందే హెచ్చరించిన సాక్షి



అత్యంత భద్రత ఉండే బృందావనం కాలనీ ఎంట్రన్స్

కావలి: కావలి పట్టణ ప్రజలు ఒక్కసారిగా ఉలికిపడ్డారు. చుట్టూ ప్రహరీ గోడ, కాలనీలో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ వంటి భద్రతాపరమైన ఏర్పాట్లు ఉన్న బృందావనం కాలనీలో భారీ చోరీ జరగడం పట్ల స్థానికులు నివ్వెరపోయారు. భద్రతా వలయంలో ఉండే కాలనీలో ఒక ఇంట్లో 165 సవర్ల బంగారం, రూ.1.5 లక్షల నగదు అపహరణ గురికావడం పోలీస్ శాఖ భద్రతా వైఫల్యానికి సవాల్‌గా నిలుస్తోంది. పట్టణంలోని ప్రధానమైన ట్రంక్‌రోడ్డు ముఖద్వారంగా బృందావనం కాలనీ ఉంది. సంపన్నులు మాత్రమే నివాసం ఉండే 114 ఇళ్ల సముదాయంతో కూడిన బృందావనం కాలనీ కావలి పట్టణంలోనే అత్యంత సురక్షితమైన ప్రదేశంగా భావిస్తుంటారు. అటువంటి సురక్షితమైన కాలనీలో భారీ చోరీ జరగడంతో కావలి పట్టణంలోని ప్రజలు ఉలికిపడ్డారు. వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నప్పటికీ, కావలి పట్టణంలోని టూ టౌన్ పోలీసులు, కావలి రూరల్ పోలీసులకు కూడా సరిహద్దుగా బృందావనం కాలనీ కావడం గమనార్హం. దీంతో రాత్రి వేళల్లో కావలిలోని మూడు పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీసులు కాలనీ ముఖద్వారం వద్ద ఉన్న ట్రంక్‌రోడ్డు పైనే విధులు నిర్వహిస్తుంటారు.

నెల రోజుల క్రితమే హెచ్చరించిన 'సాక్షి'

కావలిలో భద్రతకు పోలీసులు మంగళం చెప్పారని 'సాక్షి' నెల రోజుల క్రితమే హెచ్చరించింది. కావలి పట్టణంలో నేరాలు పెరుగుతున్నాయి, గస్తీని గాలికి వదిలేసి స్టేషన్‌కే పరిమితమవుతున్న పోలీసులు, కావలి పట్టణ పరిధిలో మూడు పోలీస్ స్టేషన్లు ఉన్నప్పటికీ విజిబుల్ పోలీసింగ్ అమలు కావడం లేదని వరస కథనాలతో సాక్షి పోలీసుల నిర్లక్ష్యాన్ని వెల్లడించింది. పట్టణంలో సీసీ కెమెరాలు పని చేయడం లేదని, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ నిరుపయోగంగా ఉండడంతో నిద్రావస్థలో నిఘా నేత్రం వల్ల పట్టణంలో పోలీసులు స్థానికుల్లో విమర్శలు ఎదుర్కొంటున్నారని స్పష్టంగా చెప్పింది. అయినప్పటికీ కావలి పోలీసులు భద్రతా చర్యలపై సాక్షి కథనాలను విస్మరించారు. ఆదివారం తెల్లవారుజామున జరిగిన భారీ చోరీ ఘటన పోలీస్‌శాఖ వైఫల్యానికి అద్దం పడుతోంది. జిల్లా పోలీస్ బాస్‌గా తిరుమలేశ్వరరెడ్డి బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల్లో జిల్లాలోనే సంచలనమైన భారీ చోరీ జరిగింది. ఈ చోరీ ఛేదనను జిల్లా పోలీస్ బాస్ ఛాలెంజ్‌గా తీసుకుని దర్యాప్తు చేపట్టాడానికి ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నారు. అందులో భాగంగానే ఎస్పీ స్వయంగా ఘటనా స్థలాన్ని పరిశీలించడం గమనార్హం.



ఘటన జరిగిన ఇంటి వద్దకు వస్తున్న డాగ్ స్క్వాడ్

పీఆర్‌సీ సమస్య పరిష్కరించాలి

- యూటీఎఫ్ రీజనల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బాబురెడ్డి

ఆత్మకూరు: ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించిన పీఆర్‌సీ సమస్య కొన్ని సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోక ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని ప్రభుత్వం ఇప్పటికైనా నూతన పీఆర్‌సీని ప్రకటించాలని రాష్ట్ర యూటీఎఫ్ మాజీ గౌరవాధ్యక్షుడు పి బాబురెడ్డి కోరారు. ఆత్మకూరు ప్రాంతీయ మండలాల యూటీఎఫ్ సమావేశం ఆదివారం పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ప్రాంతీయ అధ్యక్షుడు ఎం.గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బాబురెడ్డి మాట్లాడుతూ విలీనం పేరుతో పలు పాఠశాలలను మూసివేయడం సరికాదని, నూతన డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ భర్తీలను పూర్తి చేయాలని, బకాయి ఉన్న కరువు భత్యాలను ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీవీ శేషులు, కోశాధికారి మురళీధర్, కార్యవర్గ సభ్యులు మోహన్‌ప్రసాద్, బి శివప్రసాద్ రావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీలకు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

కావలి రూరల్: కావలి నియోజకవర్గంలోని విద్యార్థులకు ఈ నెల 17వ తేదీ నుంచి పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడు దామోదర్‌నాయుడు తెలిపారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని గీతాంజలి జూనియర్ కళాశాలలో ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద విశిష్టమైన విద్యార్థి సంస్థ ఏబీవీపీ అన్నారు. నిరంతరం విద్యార్థుల సమస్యల కోసం పోరాటాలు చేస్తూ విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందిస్తూ ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి త్రినాథ్, సహాయ కార్యదర్శి హరిష్, ఎస్ఎఫ్‌డి కార్యదర్శి అశోక్, కార్యవర్గ సభ్యులు వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ



ముస్లింలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సంగం: రంజాన్ పండగ నేపథ్యంలో మండలంలోని జెండాదిబ్బలో ఆదివారం బుచ్చిరెడ్డిపాళెం సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 150 నిరుపేద ముస్లిం మహిళలకు చీరలు, సేమియాలు పంపిణీ చేశారు. జిల్లా మైనార్టీ నాయకుడు అల్లాభక్షు, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరయ్య, సయ్యద్ సర్దార్, సొసైటీ అధ్యక్షుడు యస్దాని బాషా, సభ్యులు పఠాన్ రహమతుల్లా, దాత గౌస్ బాషా, పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహాయం చేసిన దాతలకు సంస్థ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి



ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలని సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజా జాతర నిర్వహించాయి. మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు పి మోహన్ రావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుందని ఇది దారుణమని బీజేపీని దుయ్యబట్టారు. ఎందరో ప్రాణ త్యాగంతో ఏర్పాటు చేసుకున్న విశాఖ ఉక్కును సైతం ప్రైవేట్ సంస్థలకు అమ్మేందుకు కేంద్రం ప్రయత్నించడం సిగ్గుచేటు అన్నారు. పార్టీల నాయకులు షేక్ సందానీ, ఎ నాగయ్య, సాలారుద్దీన్, ఎల్‌కే ప్రసాద్, కేవీ శేషారెడ్డి, వి శ్రీహరి, యస్దానీ, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఆత్మకూరురూరల్: మర్రిపాడులో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



టిడ్కో గృహాల వద్ద అగ్నిప్రమాదాలపై ప్రదర్శన చేసి వివరిస్తున్న ఆ శాఖ అధికారులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మర్రిపాడు అగ్నిమాపక శాఖ అధికారులు ఆదివారం అగ్నిప్రమాద నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఫైర్ ఆఫీసర్ బి పెంచలయ్య ఆధ్వర్యంలో మర్రిపాడులోని పెట్రోల్ బంకులు సందర్శించి వాహనాలకు పెట్రోల్ నింపేటప్పుడు ఫోన్ మాట్లాడరాదని, నో స్మోకింగ్ బోర్డులు విధిగా ఏర్పాటు చేయాలని, పెట్రోల్ బంకుల సిబ్బందికి సూచించారు. నిబంధనల ప్రకారం ప్రతి పెట్రోల్ బంకులోనూ అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా వినియోగించాలన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి వివరించారు. కార్యక్రమంలో మర్రిపాడు ఫైర్ స్టేషన్ సిబ్బంది రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో అగ్నిప్రమాదాల నివారణ

ఆత్మకూరు: ముందు జాగ్రత్తలు తీసుకుంటే అగ్నిప్రమాదాలు సంభవించకుండా చేయవచ్చునని ఆత్మకూరు అగ్నిమాపకశాఖ అధికారులు పేర్కొన్నారు. అగ్నిమాపకశాఖ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం మున్సిపల్ పరిధిలోని టిడ్కో గృహాలు, పలు అపార్ట్‌మెంట్ల వద్ద గ్యాస్ సిలిండర్ల వాడకం, చోటు చేసుకునే ప్రమాదాల నివారణ, విద్యుత్ ప్రమాదాల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు గురించి ప్రదర్శన చేసి చూపారు. కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారి టి రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

400 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్యశిబిరంలో రోగులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీధర్

అనుమసముద్రంపేట: అనుమసముద్రంలో ఆదివారం కావలిలోని శ్రీధర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసింది. గ్రామానికి చెందిన పామూరు విశ్వనాథం కుమారుడు పామూరు శ్రీధర్, పామూరు శివప్రసాద్ కావలిలో శ్రీధర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. అయితే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కో ఆర్డినేటర్ పులిమి వెంకట రమేష్‌రెడ్డి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని కోరిన వెంటనే డాక్టర్ శ్రీధర్ తల్లి ఉమ వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సొంత ఊరిలో వైద్యసేవలు అందించడం సంతోషంగా ఉందని డాక్టర్ల బృందం తెలిపింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సహజ పానియాలే ఆరోగ్యం

కావలిరూరల్ : ప్రస్తుత సమాజంలో అధిక ఉష్ణోగ్రతలకు ప్రజలు శీతల పానియాలపై మక్కువ పెంచుకుని అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారని జనవిజ్ఞాన వేదిక పట్టణ అధ్యక్షుడు తోటా వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని ట్రంకురోడ్డులో శీతలపానియాలపై ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. శీతల పానియాలు తీసుకోవడం వల్ల స్థూలకాయం, కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులు, అధిక రక్తపోటు, దంత క్షయం, ఎముకలు పెలుసుబారి పోవడం, కేన్సర్, పురుషత్వ లోపాలు, మధుమేహం వంటి వ్యాధులకు గురవుతూ ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు.

రెండో పంటకు పుష్కలంగా సాగునీరు

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలిరూరల్: కావలి నియోజకవర్గంలోని రైతాంగానికి రెండో పంటకు సాగునీరు పుష్కలంగా అందిస్తామని, తక్కువ కాలం పంటలను సాగు చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గ అధికారులు, రైతాంగంతో రెండో పంట సాగుపై ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలి కాలువ కింద 3 టీఎంసీల నీరు కేటాయించారని, దీంతో పాటు మరికొంత నీరు తెచ్చుకునే అవకాశం ఉందన్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకుని పంటలు సాగు చేసుకోవాలన్నారు. అధికారులు ముందుగానే చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పైడేరు కాలువ ద్వారా నీటిని వృథాగా సముద్రానికి తరలిస్తున్నారని, ఆ నీటిని చెరువులకు మళ్లించి చెరువు నింపాలన్నారు. రెండో పంట సాగులో చివరి ఆయకట్టు వరకు పుష్కలంగా నీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, రైతులకు తెలిపారు. అధికారులకు పలు సలహాలు, సూచనలందించారు. అనంతరం రైతులు పలు సమస్యలను ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకురావడంతో అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శీనానాయక్, ఇరిగేషన్ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ సివిల్స్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు సివిల్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కావలి రూరల్: ఏపీపీఎస్సీ గ్రూప్–2, గ్రూప్–1, సివిల్స్ పరీక్షలపై అశోకా ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ ఒక ప్రణాళికతో, పట్టుదలతో కృషి చేస్తే సాధ్యం కానిది ఏది ఉండదని, సాధించాలనే కసి, పట్టుదల ముందు విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు పాఠశాలల దశ నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ లక్ష్యం ఛేదించే దిశగా ముందుకు సాగాలన్నారు. సివిల్స్ కోచింగ్ తీసుకునే వాళ్లకు అతి తక్కువ ఖర్చుతో కావలి పట్టణంలోని కారోనేషన్ రీడింగ్ రూం దగ్గర ఉన్న అశోకా ఐఏఎస్ అకాడమీలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రూప్–2లో విజయం సాధించిన వంశీకృష్ణ, ఆర్.జ్యోతి సివిల్స్‌కు సిద్ధమయ్యే విద్యార్థులకు పలు సలహాలు, సూచనలందించారు. ఈ సదస్సులో అకాడమీ శిక్షకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో సంపద సృష్టి



ఆత్మకూరురూరల్: మర్రిపాడు మండలం కేతిగుంటలో స్థానిక సర్పంచ్ హరితేజ బహూకరించిన నాగలి, పొగాకు, చీనీ నిమ్మకాయలతో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): విద్యార్థులు, రైతులు, మహిళలు తరతర వర్గాలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలు ఆర్థిక పురోభివృద్ధి సాధించడమేగాకుండా పునరాగమన పద్ధతిలో సంపద సృష్టి జరిగి ఆర్థిక స్థిరత్వం ఏర్పడుతుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం కేతిగుంటలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం వారికి అందించిన సంక్షేమ ఫలాలు, ఆర్థిక ప్రయోజనాలను తెలియజెప్పారు. కార్యక్రమానికి ముందు కేతిగుంట సర్పంచ్ నాగెళ్ల హరితేజ ఆధ్వర్యంలో మహిళలు మంగళ హారతులు పట్టి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిపై ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని ఎక్కించి నాగలి, కేతిగుంటలో ప్రధాన పంటగా ఉన్న పొగాకు, చీని నిమ్మకాయలును బహూకరించారు. అనంతరం కేతిగుంట, పల్లిపాడు గ్రామాల్లో ప్రతి గడపకు తిరిగి సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉర్లగంటి శ్రీనివాసులు రెడ్డి, గాలిబోయిన పెద పెంచలయ్య, వెంకట సుబ్బయ్య, బండారు కొండయ్య, మోదేపల్లి రఘురామయ్య, ముటుకుందు లక్ష్మీరెడ్డి, ఆర్ సురేంద్ర, ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్, వెలుగు సీసీ మహాలక్ష్మి, మాదాల సుబ్బారావు, గంగినేని బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా మా నమ్మకం నువ్వే జగన్



అల్లూరు: గృహసారథులకు, వలంటీర్లకు, కన్వీనర్లకు అభినందనలు తెలుపుతున్న నాయకులు



ఆత్మకూరు రూరల్: కరటంపాడులో బోచర్లను లబ్ధిదారులకు అందజేస్తున్న నాయకులు



ఆత్మకూరు: 1వ వార్డు పరిధిలో జగనన్నే మా భవిష్యత్ నిర్వహిస్తున్న కౌన్సిలర్ తదితరులు



ఆత్మకూరు: 9వ వార్డు పరిధిలో జగనన్నే మా నమ్మకం నిర్వహిస్తున్న కౌన్సిలర్, సచివాలయ కన్వీనర్



చేజర్ల: సంక్షేమ పథకాలను తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి కులమతాలకు అతీతంగా ఎలాంటి సిఫార్సులు లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు. ఇంటింటా మా నమ్మకం నువ్వే జగన్ అంటున్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు జగనన్నే మా భవిష్యత్, జగనన్నే మా నమ్మకం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని 1, 5, 9 వార్డుల్లో పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఆ పరిధిలో ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు ఏ మేరకు సంక్షేమ పథకాలు అందాయో వివరాలు ఉండే కరపత్రాలను అందజేస్తున్నారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు మొలబంటి రాజశేఖర్, ఎస్‌కే మహబూబ్ బాషా, కొప్పోలు రమాదేవి, పార్టీ నాయకులు నలిశెట్టి శ్రీనివాసులు, మాలకొండయ్య, శ్రీనివాసులు రెడ్డి, కొప్పోలు చిన్నపరెడ్డి, ప్రవీణ్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

చేజర్ల: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఆదివారం మండలంలోని నాగులవెలటూరు సచివాలయ పరిధిలోని కాశేయపాళెంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలంగాధర్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ వేలూరు తిరుపతినాయుడు, సచివాలయ కన్వీనర్ మురళీకృష్ణయాదవ్, నాయకులు రవీంద్రనాయుడు, నూతేటి ఓబయ్య నాయుడు, అంకయ్య ముదిరాజ్, ప్రసాద్ యాదవ్, నాయబ్‌రసూల్, గ్రామ వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రచారం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలం కరటంపాడు, మర్రిపాడు మండలం తిక్కవరం, పెగళ్లపాడు, తదితర గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు గంగినేని నారాయణస్వామి, శ్రీనివాసులు, ఖాసీం, తిరుమల, ఉస్మాన్‌ఖాన్, విజయ్, స్థానిక వలంటీర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

పురిణిలో..

అల్లూరు: మండలంలోని పురిణిలో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు తాండ్ర మల్లికార్జున ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి గృహ సారథులు, వలంటీర్లకు, సచివాలయ కన్వీనర్లకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురిణిలో మొత్తం 1,012 ఇళ్లను సందర్శించి వారిలో 95.5 శాతం మంది తమ ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టికర్‌ను సంతోషంగా అంటించుకుని తమ మద్దతు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, ఉస్మాన్ షరీఫ్, నిమ్మల భాస్కర్, మనోహర్, సుధా, రసూల్, శ్రీహరి, చెంటాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.